క్లుప్తంగా

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



రికార్డులను పరిశీలిస్తున్న వెంకటరమణ

రామడుగు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి, ఫార్మసీ గదులను పరిశీలించారు. రోగులకు అవసరమైన అన్నిరకాల మందులు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సన జవరియా, మండల వైద్యాధికారి రమేష్‌లతో పాటుగా సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

హుజూరాబాద్: హుజూరాబాద్‌ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి మాధవిని శుక్రవారం పట్టణంలోని సిద్ధార్థనగర్ సొసైటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సాగివీరభాద్రరావు, మనోజ్, రిటైర్డు పీడీ రాజిరెడ్డి, మురికి గౌరిశంకర్ తదితరులున్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



మంజూరు పత్రాలు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, మెట్‌పల్లి, తాడికల్ గ్రామాల్లో శుక్రవారం లబ్ధిదారులకు మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అంతకుముందు కొంత మంది లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

వీణవంక: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అథితి డెవలపర్స్ అధినేత, కాంగ్రెస్ పార్టీ యువనేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందుతాయని, ఎవ్వరు అధైర్యపడొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మ్యాక వీరయ్య, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బండారి లక్ష్మణ్ ఉన్నారు.

చిగురుమామిడిలో బడిబాట



బడిబాటలో అంగన్‌వాడీ టీచర్లు

చిగురుమామిడి: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని మండల విద్యాధికారి పావని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. నర్సరీ పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు దగ్గర్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 35 మంది ఐదేళ్ల పైబడి ఉన్నారని వారందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, సీఆర్పీ బెజ్జంకి ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

రామడుగు: రాజీవ్ యువ వికాసం పథకం దరాఖస్తులను ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది సూపరింటెండెంట్ రాజేశ్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలో పథకం కోసం 2701 మంది దరాఖస్తులను చేసుకున్నారని ఎంపీడీవో రాజేశ్వరీ తెలిపారు.

పనులు పూర్తికాక ప్రయాస

- అధ్వానంగా మానకొండూర్ – వేగురుపల్లి రోడ్డు
- కంకర, మట్టి పోసి వదిలేసిన వైనం
- గుంతలరోడ్డుపై తరచూ ప్రమాదాలు

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రం నుంచి వేగురుపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, పచ్చునూర్, ఊటూర్ గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. రూ.2కోట్ల నిధులతో రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై కంకర, మట్టి పోసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహనాలు చెడిపోతున్నాయని, రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. రోడ్డుపై ప్రతి నిత్యం ఇసుక ట్రాక్టర్లు, లారీలు ప్రయాణించడంతో రోడ్డు అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు వెల్ది శివారు పరిధిలో చిన్నకల్వర్టు కూలిపోవడంతో పైపులైన్ వేసి మట్టితో చదును చేశారు. వర్షాకాలం మొదలైనా ఇప్పటి వరకు కల్వర్టుకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మానకొండూర్- వేగురుపల్లి రోడ్డు మరమ్మత్తులకు రూ.40 లక్షలు మంజూరైనా ఇప్పటి వరకు టెండర్లు వేయకపోవడంతో పనులు ప్రారంభించలేదు. వర్షాకాలంలో ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని, సంబంధిత అధికారులు, నాయకులు తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో తాత్కాలికంగా వేసిన పైపులు



గుంతలమయంగా రోడ్డు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

గంగాధర: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, రాబోయే నాలుగేళ్లలో అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మధురానగర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రొసీడింగ్స్ అందజేశారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కురిక్యాల గ్రామంలో రెండు వందల ఇళ్లతో పాటు మండలానికి 721 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని, కాంగ్రెస్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తప్పక అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం గంగాధర మండలంలోని రైతులకు రూ.17 కోట్ల రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.48 కోట్లు మాఫీ చేసిందన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు పరిహారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇంటగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తిచేస్తుంటే వెంటనే నిధులు విడుదల చేస్తామన్నారు. జెడ్పీ సీఈవో శ్రీనివాస్, హౌజింగ్ పీడీ గంగాధర్, తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో రాము, మార్కెట్ చైర్‌పర్సన్ రజిత, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రావు, మనోహర్, బుచ్చయ్య, సత్తు కనుకయ్య, అట్ల శేఖర్ రెడ్డి, కోల ప్రభాకర్, వొడ్నాల యగ్నేష్ పాల్గొన్నారు.

తారురోడ్డు పనులకు శంకుస్థాపన

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ నుంచి చిట్యాలపల్లి వరకు రూ.4.44 కోట్లతో నిర్మించే తారురోడ్డు పనులకు అధికారులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ప్రజాపాలనలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. రోడ్డు నిర్మాణంతో జిల్లా కేంద్రానికి దూరం తగ్గడంతో పాటు విద్యార్థులకు, రోజువారి కూలీలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు, గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశారు.



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సీపీఎల్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విన్నర్, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా పట్టణంలోని భద్రాద్రి క్రికెట్ టీం పోటీలు నిర్వహిస్తూ వస్తుంది. బహుమతులను ఎస్‌వీజేసీ కళాశాలల డైరెక్టర్ సింహాచలం హరికృష్ణ అందజేశారు. నిర్వాహకులు మరిమడ్ల రాజిరెడ్డి, సందీప్, శ్రావణ్, తిరుపతి పాల్గొన్నారు.

క్రైం వార్తలు

దరఖాస్తు తిరస్కరణపై కేసు

హుజూరాబాద్: సమాచార హక్కు చట్టం దరఖాస్తు తిరస్కరణపై పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ అధికారిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు అయిందని హుజూరాబాద్ న్యాయవాది ఆడెపు లింగమూర్తి శుక్రవారం వెల్లడించారు. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన వేముల తిరుపతి సమాచారం కోరుతూ 2023 మే 18న గ్రామ పంచాయతీ కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు చేశాడు. పంచాయతీ కార్యదర్శి పోస్టును తిరస్కరించడంతో తిరిగి తిరుపతికి వచ్చింది. విషయంపై 2023 జూన్ 5న జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. న్యాయవాది ఆడెపు లింగమూర్తిని సంప్రదించి హుజూరాబాద్ రెండో మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశాడు. వాదనలు పరిశీలించిన కోర్టు అప్పటి పంచాయతీ కార్యదర్శి మట్ల రాజేష్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యలపై కేసు నమోదు చేయాలని ఇల్లందకుంట పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్: సింగాపూర్ గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాజయ్య ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా జమ్మికుంటకు చెందిన రంజిత్ అనే యువకుడు కరీంనగర్ వైపు వెళ్తుండగా ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన గాజె అంజి(20) పట్టణంలో గురువారం జరిగే సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి బైక్‌పై స్వగ్రామం బయల్దేరాడు. ఈ క్రమంలో వెనుక వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడుపుతూ వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కరుణాకర్ తెలిపారు.

విత్తన బస్తాలు చోరీ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో శుక్రవారం మొలకెత్తిన విత్తన బస్తాలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన రైతు గాజుల శ్రీనివాస్ నాలుగు బస్తాల వరి విత్తనాలు సంచుల్లో మండె పోశాడు. శుక్రవారం నారుమడిలో మొలక జల్లేందుకు వెళ్లగా బస్తాలు కనిపించలేదు. నాలుగు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన మరో రైతు విత్తన బస్తాలను దొంగలు ఎత్తు కెళ్లారని రైతులు తెలిపారు. పోలీసులు దొంగలను పట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరారు.

మైనింగ్ ఏడీకి ఫిర్యాదు

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి ఇసుక రీచ్ నుంచి వచ్చే వాహనాల వల్ల రోడ్డు ధ్వంసమవుతుందని తెలంగాణ గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం సమ్మయ్య శుక్రవారం జిల్లా మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేశాడు. గ్రామం సింగిల్ రోడ్డుపై నుంచి లారీలు వెళ్లడం వల్ల గుంతలు ఏర్పడుతున్నాయని, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వేరే దారి గుండా వాహనాలు వెళ్లడం లేదని రీచ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే గ్రామస్తులతో కలిసి మైనింగ్ ఏ డీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకై టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలపై ముద్రించిన ప్రచార జాత కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. 2024 డీఎస్సీ నిర్వహించి 11,000 పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్స్, ట్రాన్స్‌ఫర్స్ నిర్వహించిందని తెలిపారు. తనకు హాస్టల్ విద్యార్థిగా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే డైట్ చార్జీలను 40 శాతం అదనంగా పెంచారన్నారు. పాఠశాల విద్య అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాఠశాలల్లో నమోదు పెంచడానికి యూటీఎఫ్ నిర్వహిస్తున్న ప్రచార జాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, జిల్లా కార్యదర్శులు డాక్టర్ వొల్లాల శ్రీనివాస్, ముల్కల ఎల్లయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నేడు విద్యుత్ సరఫరా బంద్

శంకరపట్నం: మండలంలో నూతనంగా 33కేవీ లింక్‌లైన్ ఏర్పాటులో భాగంగా కాచాపూర్ ఫీడర్‌లో శనివారం ఉదయం పదిన్నరు నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నామని ట్రాన్స్‌కో ఏఈ రఘు తెలిపారు. మొలంగూర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. మొలంగూర్, చింతలపల్లి, నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి గ్రామాలకు విద్యుత్ సరాఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

హుజూరాబాద్‌లో ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



పండ్లు అందజేస్తున్న కమిషనర్, దాతలు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ... వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోవద్దనే ఉద్దేశంతో శిబిరం నిర్వహించామని, ఎంతోమంది విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించారని, దాతలు ముందుకు వచ్చి క్రీడాకారులకు స్నాక్స్ అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ సాంబరాజు, కార్యాలయ మేనేజర్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండిలో ఉపాధ్యాయులకు..



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ అయాజ్, ఎంఈవో హేమలత

జమ్మికుంట: విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించేందుకు శిక్షణ తరగతులు దోహదపడుతాయని తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో ఎంఈవో హేమలత ఆధ్వర్యంలో ఇంగ్లిష్ స్పీకింగ్ స్కిల్స్, కరాటే, డ్యాన్స్‌పై నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. శుక్రవారం ముగింపు సమావేశంలో మాట్లాడుతూ... శిక్షణ తరగతులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ 1 డిపో మేనేజర్ డయల్ యువర్ ప్రోగ్రాం ఈనెల 31న శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు 1 డిపో మేనేజర్ ఐ.విజయ మాధురి తెలిపారు. 1డిపో పరిధిలోని తిమ్మాపూర్, మానకొండూర్, బెజ్జంకి, వీణవంక మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను సెల్ నం .8121993780కు డయల్ చేసి తెలుపాలని కోరారు.

కళాకారులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదు



కళాకారులను సన్మానిస్తున్న పర్శరాములు

చిగురుమామిడి: రంగస్థల కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంలేదని, ప్రభుత్వం గౌరవవేతనం అందజేయాలని రంగస్థల కళాకారుల సంఘం జిల్లా సహాయకార్యదర్శి చంద బోయిన పర్శరాములు కోరారు. మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో డక్కలి కళాకారులు నాటకం ప్రదర్శించారు. ఈసందర్భంగా గురువారం రాత్రి కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సంఘం గ్రామ అధ్యక్షుడు మంద కృష్ణ, గౌరవాధ్యక్షుడు జిల్లెల్ల పోచయ్య, ఉపాధ్యక్షుడు బొట్ల కొంరయ్య, మండల సంయుక్త కార్యదర్శి కుతాటి కొంరయ్య, మంద మల్లయ్య, బొట్ల సంతప్, మంద లక్ష్మణ్, కుమారస్వామి పలువురు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష



శంకరపట్నం: ఎరడపల్లిలో సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి దళితకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. దళితులపై వివక్ష చూపుతున్నారని ఓదెల రాజయ్య ఆరోపించారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించారని, సాక్ష్యం చెప్పిన వ్యక్తిని దూషించినా పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. కాలనీలో విద్యుత్ తీగలతో ఇబ్బందులు పడుతున్నామని, కార్యదర్శి పారిశుధ్యం పట్టించుకోవడం లేదని, ఇందిరమ్మ ఇళ్లు రాలేదని మండిపడ్డారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పార్థసారిధి, ఎంపీవో ప్రభాకర్, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, ట్రైనీ ఎస్సై సుమన్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సతీష్, మాజీ సర్పంచ్‌లు రంజిత్‌రావు, భద్రయ్య, నాయకులు సుధీర్, శ్రీనివాస్, ఓదెలు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరం: ఖాసీంపేటలో..

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామ అంబేడ్కర్ సంఘం భవనంలో అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. దళిత కాలనీల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రజినీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వివిధ చట్టాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలి

గంగాధర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. రైతులను సంపన్నులుగా చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం గంగాధర, గర్శకుర్తి గ్రామాల్లోని రైతు వేదికల్లో కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలు, మద్దతు ధర, పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతిరైతు భూసార పరీక్షలు చేయించుకొని తదనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు బ్రజేంద్ర, డాక్టర్ సునీత, కోట, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, మండల ఏవో శ్రీనివాస్, విస్తరణ అధికారులు వంశీధర్, గోపిచంద్, వెంకటస్వామి, రమ్య పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, ఇందుర్తి రైతువేదికల్లో శనివారం నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించనున్నామని మండల వ్యవసాయశాఖాధికారి రాజులునాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ పరిశోధన మండలి నుంచి పలువురు శాస్త్రవేత్తలు హాజరవుతారని, రైతులు తప్పనిసరిగా ఖరీఫ్ పంటల సాగుకు సందేహాలు, ప్రశ్నలను నివృత్తి చేసుకునేందుకు హాజరుకావాలని కోరారు.



గంగాధర: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

రైతులకు రశీదులు ఇవ్వాలి

శంకరపట్నం: ఎరువులు, విత్తనాలు, పురుగు మందు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఏడీఏ శ్రీధర్ డీలర్లకు సూచించారు. కేశవపట్నం రైతువేదికలో శుక్రవారం సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల డీలర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. లైసెన్స్, స్టాక్ రిజిష్టర్లు, రశీదు బుక్కుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. పీఓఎస్ యంత్రం ద్వారానే విక్రయాలు జరపాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, నకిలీ పురుగుమందు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఏవో వెంకటేశ్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేదపండితులు శ్రీనివాస్‌శర్మ, మణికంఠ ఆధ్వర్యంలో హోమం, బలిదానం తదితర పూజాదికార్యక్రమాలు, యంత్రప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడు గుడాల సంపత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, కోశాధికారి పైడిపెల్లి రాజు, డైరెక్టర్లు పెద్ద గంగయ్య, మార్క రాజయ్య, పైడిపెల్లి చిన్నవెంకన్న, బుర్ర శ్రీనివాస్, కుమారస్వామి, కళ్యాణ్, జాగిరి కుమార్, పైడిపెల్లి మల్లేశం, కుమార్, పి పర్శరాములు పాల్గొన్నారు.



విగ్రహప్రతిష్ఠాపనలో గౌడ సంఘం సభ్యులు

'ఉత్తమ్' ఉత్తర ప్రగల్బాలు మానుకోండి

కరీంనగర్: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏడాదిన్నర కాలంలో ఎన్ని నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని, ఉత్తర ప్రగల్భాలు మానుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రులు బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ నాయకుడు, ఆయన నాయకత్వం మాకు మార్గదర్శకమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వదంతులేనని తేల్చిచెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 85 పిల్లర్లు ఉంటే రెండు పాక్షికంగా దెబ్బతింటే మొత్తం కాళేశ్వరం నిర్వర్యమైందని, కూలిపోయిందనడం ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎన్నటికీ బీజేపీలో కలవదని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు దూలం బాలాగౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు

ఇల్లందకుంట: రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు సారంగపాణి, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, మీస రాజయ్య, మ్యాడదతిరుపతిరెడ్డి, బండి మల్లయ్య, గురుకుంట్ల స్వామి, భోగంసాయిరాం, మర్రి వీరారెడ్డి, రాము, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి, వేణు, వంశీ, మారెపెల్లి రమేష్, సరిగొమ్ముల సదానందం, రేణుకుంట్ల రవీందర్, దిలీప్, రవి, తోటరాజు, మురహరి రాజు, రమేష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయం(బొమ్మలగుడి)లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిని రవి, మొలుగూరి సదయ్య, దేశినికోటి, ముద్దమల్ల రవి, పతకాల అనిల్, బుర్ర కుమార్, మండ అశోక్ ,పోతుల శ్రీనివాస్, దొగ్గల భాస్కర్, పంజాల అజయ్,మ్యాకమల్ల అశోక్, ప్రభుదాస్, అల్లం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న నాయకులు